ఇరుకు వంతెనతో ఇక్కట్లు

- రాకపోకలకు ఇబ్బందులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు


నికాల్‌పూర్‌–డొంకేశ్వర్‌ మార్గంలో ఇరుకుగా ఉన్న వంతెన

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): నికాల్‌పూర్‌–డొంకేశ్వర్‌ బైపాస్‌ రోడ్డులో ఇరిగేషన్‌ కాలువపై నిర్మించిన వంతెన ఇరుకుగా మారింది. దీని మీదుగా ప్రయాణం చేయాలంటే వాహనదారులు సాహసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా బస్సులు, లారీలు, ఆటోల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వంతెన ఇరుకుగానే కాకుండా సైడ్‌ వాల్స్‌ తక్కువ ఎత్తులో ఉండడంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు తగ్గిన ఎత్తు లేకపోవడం వలన వాహనాలు అదుపు తప్పుతున్నాయి. పట్టుతప్పి నీటి కాలువలో పడితే ఇక అంతే సంగతి. బాద్గుణ, కొండూర్‌, కోమట్‌పల్లి, నికాల్‌పూర్‌, డొంకేశ్వర్‌తో పాటు మండల చుట్టు పక్కల గ్రామాలను కలుపుతూ కాలువపై వంతెనను నిర్మించారు. పంచాయతీరాజ్‌ అధికారులు మూడు కిలో మీటర్ల మేర బైపాస్‌ బీటీ రోడ్డును వేశారు. దూరం తగ్గడంతో వాహనాల రాకపోకలు పెరిగాయి. కానీ, వంతెన కేవలం పది ఫీట్లు వెడల్పుతో ఉంది. ఒక వాహనం వెళితే మరో వాహనం ఆగాల్సి వస్తోందని వాహనదారులు చెప్తున్నారు. ఇటువైపు పంట పొలాలు కూడా ఎక్కువగా ఉండడంతో రైతులు ఆచితూచి వెళ్తున్నారు. ముందుచూపు లేకుండా బ్రిడ్జిని నిర్మించడంపై విమర్శలు వస్తున్నాయి. ఇరుకు వంతెనతో ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెడల్పుతో కొత్త వంతెనను నిర్మించి విద్యుత్‌ దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అదే విధంగా బీటీ రోడ్డుపై తేలిన గుంతలను పూడ్చాలని లేదంటే కొత్త రోడ్డు వేయాలని డిమాండ్‌ చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి



కోడిగుడ్లు సరఫరా చేయడానికి ప్రతీ రోజు ఇదే మార్గంలో ట్రాలీ ఆటోను నడుపుతాను. ఇరుకు వంతెన వద్ద రోడ్డు ఎగుడు, దిగుడు ఉండడంతో వాహనం నడపడం కష్టంగా ఉంటుంది. ఇక్కడ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అధికారులు స్పందించి పెద్ద వంతెనతో పాటు కొత్త రోడ్డును వేస్తే బాగుంటుంది.

– సరేశ్‌, నికాల్‌పూర్‌

ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి


ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు


బాల్కొండలో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

ఆర్మూర్‌టౌన్‌: ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటోడ్రైవర్లు రోడ్డున పడాల్సి వస్తోందని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని ఏఐటీయూసీ యూనియన్‌ నాయకుడు ఆరెపల్లి సాయిలు డిమాండ్‌ చేశారు. ఆటో డ్రైవర్లు శుక్రవారం ఆర్మూర్‌లోని మినీ స్టేడియం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం తమను ఆదుకోవాలని ఆర్డీవో వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

బాల్కొండ: తమ కుటుంబాలను ఆదుకోవాలని బాల్కొండలో ఆటో డ్రైవర్లు శుక్రవారం నిరసన తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్ల, కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ప్రభుత్వం తమ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అనంతరం ఆటోలతో ర్యాలీ నిర్వహించారు.

పశువులకు టీకాలు



మాక్లూర్‌: మండలంలోని గుత్పలో శుక్రవారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. గర్భకోశవ్యాధి నివారణ కోసం మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ టీకాలు వేస్తున్నట్టు పశువైద్యులు కిరణ్‌దేశ్‌పాండే తెలిపారు. పశువైద్యురాలు ఉమా సహేర్‌, సర్పంచ్‌ గంట చిన్నయ్య, సిబ్బంది హైమద్‌పాషా, సుధీర్‌, శ్రీనివాస్‌, గంగారాం, పి శేఖర్‌ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన మచ్చర్ల నాయకులు



పెర్కిట్‌: ఆలూర్‌ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు జితేందర్‌ రెడ్డి, రాయదాస్‌ శుక్రవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రోడ్డుపై పారుతున్న మురుగు


బాల్కొండలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

- బాల్కొండలో డ్రెయినేజీలు లేక అవస్థలు

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నీరు జాతీయ రహదారిపై పారుతోంది. మురుగు నీరు కొంతకాలంగా జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బాల్కొండలో జాతీయ రహదారి పక్కన ఉన్న కాలనీల్లోనే కాకుండా గ్రామ మధ్యలో ఉన్న కాలనీల్లో కూడా మురికి కాలువలు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో మురుగు నీరు నివాసాల మధ్య నిలిచి దుర్గంధం వ్యాపిస్తోంది. రెండు నెలల క్రితం డెంగీ వ్యాధి మండల కేంద్రాన్ని గడగడలాడించింది. ముగ్గురు డెంగీతో మృతి చెందారు. అయినా అధికారులు గుణపాఠం నేర్వ లేదు. మురికి కాలువల నిర్మాణం పై దృష్టి సారించలేరు. మండల కేంద్రంలో గల్లీ రోడ్లకు తారు వేసి రోడ్డు నిర్మించారు. కానీ డ్రెయినేజీల నిర్మాణాన్ని మరిచారు. బాల్కొండలో ప్రధానంగా నూతనంగా ఇంటి నిర్మాణాలు చేపట్టిన కాలనీల్లో కనీస సౌకర్యాలు లేవు. ఆ ఇంటి నిర్మాణాలకు అనుమతులివ్వడం కోసం అధికారులు దండుకున్నారు. కానీ ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఇంటి నంబర్లు కేటాయించ లేదు. దీంతో ఇంటి పన్నులు వసూలు చేయడం లేదు. దీంతో జీపీకి ఆదాయం రావడం లేదు. సౌకర్యాలను మెరుగు పరచడం లేదు. అధికారులు స్పందించి వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌అండ్‌బీ వారు నిర్మించాలి

జాతీయ రహదారి పక్కన డ్రెయినేజీలను ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించాలి. పలు మార్లు నిర్మించాలని సూచించాం. గ్రామంలో మురికి కాలువల నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేశాం. ఒక్కొక్కటిగా నిర్మాణం చేపడుతున్నాం.

– రజనీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బాల్కొండ

మండల సమావేశానికి సర్పంచ్‌ల డుమ్మా

సిరికొండ: మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ సంగీత అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశానికి సర్పంచ్‌లు డుమ్మా కొట్టారు. మండలంలో 30 గ్రామ పంచాయతీలు ఉండగా కేవలం కొండూర్‌, సిరికొండ, హుస్సేన్‌నగర్‌, న్యావనంది, గడ్కోల్‌ గ్రామ సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మండల సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చి చర్చించాల్సిన సర్పంచ్‌లే డుమ్మా కొట్టడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సిరికొండ, గడ్కోల్‌, కొండూర్‌, పెద్దవాల్గోట్‌, మైలారం ఎంపీటీసీలు హాజరైనప్పటికి ఎలాంటి సమస్యలను ప్రస్తావించలేదు. అధికారులు నివేదికలు చదివి వినిపించారు. సమావేశం సాదాసీదాగా ముగిసింది. వైస్‌ ఎంపీపీ రాజన్న, తహసీల్దార్‌ రవీందర్‌రావు, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్‌ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కు.ని. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కమ్మర్‌పల్లి: మోర్తాడ్‌ కమ్యూనిటీ ఆస్పత్రిలో ఈనెల 21న పురుషుల కోసం నిర్వహించే కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరసింహాస్వామి పేర్కొన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. దోమల బెడదను నివారించేందుకు ఫ్రై డే డ్రై డేగా నిర్వహించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జీపీ కార్యదర్శి శాంతికుమార్‌, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యుత్‌ బిల్లుల చెల్లింపులో ఆదర్శం



పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మండలం మంథని గ్రామానికి చెందిన రైతులు ఒకే రోజులో వ్యవసాయ విద్యుత్‌ బిల్లులు చెల్లించి ఆదర్శంగా నిలిచారు. గ్రామంలోని 640 వ్యవసాయ మోటార్లకు సంబంధించిన రూ.2,32,200 విద్యుత్‌ బిల్లులను శుక్రవారం చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రావణ్‌ కుమార్‌, లైన్‌మెన్లు సల్ల శ్రీనివాస్‌ యాదవ్‌, కుమార స్వామి, జేఎల్‌ఎం లింబాద్రి, రమేష్‌, దినేష్‌, రైతులు హోండా నర్సా రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ సరికాదు



కమ్మర్‌పల్లి: వేల్పూర్‌ మండల కేంద్రంలో ముస్లింలపై గ్రామాభివృద్ధి సాంఘిక బహిష్కరణ విధించడం సరికాదని కమ్మర్‌పల్లి ముస్లిం కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. శుక్రవారం మండల కేంద్రంలోని ముస్లిం కమిటీ సభ్యులు సమావేశమై వేల్పూర్‌లో బహిష్కరణ విధించడాన్ని ఖండించారు. ఈద్గా స్థలానికి సంబంధించి పహాణీ, రెవెన్యూ, వక్ఫ్‌ రికార్డులు అన్ని సక్రమంగా ఉన్నప్పటికీ గ్రామాభివృద్ధి కమిటీ దౌర్జన్యంగా సాంఘిక బహిష్కరణ విధించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. జిల్లా అధికార యంత్రాంగం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

నేటి నుంచి ఆదిమల్లన్న జాతర



వేల్పూర్‌: వేల్పూర్‌ మండలం పడగల్‌ గ్రామంలో శనివారం నుంచి ఆది మల్లన్న జాతర ఉత్సవాలు జరుగుతాయని వీడీసీ సభ్యులు వెల్లడించారు. ఈ మేరకు వారు శుక్రవారం జాతర ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. శనివారం గ్రామంలో ఆదిమల్లన్న శోభాయాత్ర, ఆదివారం గంగస్నానము, సోమవారం గ్రామం నుంచి ఆదిమల్లన్న గుట్టకు రథాన్ని తీసుకెళ్లడం, మంగళవారం జాతర, రథోత్సవం, బుధవారం నైవేద్యాలు సమర్పించుకోవడం, అదేరోజు రాత్రి నాగవెల్లి, అగ్నిగుండం, గుట్టచుట్టూ శోభాయాత్ర నిర్వహించడం కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కల్లెడి సర్పంచ్‌

మాక్లూర్‌: నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలతో సస్పెండైన మండలంలోని కల్లెడి సర్పంచ్‌ లావణ్య ప్రసాద్‌గౌడ్‌ శుక్రవారం మళ్లీ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. సుదీర్ఘ కాలం పాటు సస్పెండయి బాధ్యతలు చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

బడాపహడ్‌ మీదుగా కామారెడ్డికి బస్సు నడపాలి

రుద్రూర్‌: బోధన్‌ నుంచి వర్ని, బడాపహడ్‌ మీదుగా కామారెడ్డి జిల్లా కేంద్రానికి బస్సులు నడుపాలని ప్రజలు కోరుతున్నారు. రుద్రూర్‌, వర్ని మండలాల నుంచి కామారెడ్డి వెళ్లడానికి బాన్సువాడ పట్టణానికి వెళ్లి మరో బస్సు మరాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బోధన్‌ డిపో నుంచి కామారెడ్డి బస్సు నడిపితే సమయం ఆదా కావడంతో పాటు చార్జీలు తగ్గుతాయని అన్నారు.

పెన్షనర్స్‌డేను విజయవంతం చేయాలి

బోధన్‌: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం డివిజన్‌ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17న పట్టణంలోని సంఘ భవనంలో పెన్షనర్స్‌డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు డివిజన్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య, రాజేశ్వర్‌రావు తెలిపారు. సంఘ సభ్యులకు క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తామన్నారు. సభ్యులు అధిక సంఖ్యలో తరలి రావాలని వారు కోరారు.

పనులను వెంటనే పూర్తి చేయాలి



బాల్కొండ: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ పనులను వెంటనే పూర్తి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. బాల్కొండలో నిర్మిస్తున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



మోర్తాడ్‌: బాలల హక్కులపై ఏర్గట్ల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్‌ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బడి ఈడు పిల్లలు చదువుకోవాలని ఎవరైనా తల్లిదండ్రులు పనికి పంపిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. డీసీపీవో చైతన్య సాయిలు, ఏసీపీవో జ్ఞానేశ్వరి, ఎస్సై మచ్చేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్‌ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్దార్‌ పటేల్‌కు నివాళి

ఆర్మూర్‌టౌన్‌: భారత తొలి ఉప ప్రధాని, తొలి హోంశాఖ మంత్రి, ఉక్కుమనిషి సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ వర్ధంతిని శుక్రవారం బీజేపీ నాయకులు నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తా వద్ద పటేల్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్‌, బొట్ల విజయ్‌, షికారి శ్రీనివాస్‌, ఈశ్వర్‌, పులి యుగంధర్‌, కలిగోట ప్రశాంత్‌, ఉదయ్‌గౌడ్‌ పిరసింగ్‌, నగేష్‌ పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



పోస్టాఫీస్‌ ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది

ఆర్మూర్‌టౌన్‌: గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పట్టణంలోని పోస్టాఫీస్‌ ఎదుట జీడీఎస్‌లు చేపట్టిన సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు లింబాగౌడ్‌, రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌, శ్రీకాంత్‌, వెంకటేష్‌, రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో సామాజిక తనిఖీ ప్రజావేదిక


నవీపేటలో సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్‌డీవో చందర్‌నాయక్‌

నవీపేట: మండలంలో 2022 ఏప్రిల్‌ నుంచి 2023 మార్చి వరకు చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన ప్రజావేదికను డీఆర్‌డీవో చందర్‌నాయక్‌ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వార్షిక సంవత్సరంలో రూ.4.28 కోట్ల వ్యయంతో వివిధ పనులను చేపట్టారు. వీటికి సంబంధించి ఈనెల 4 నుంచి మండలంలోని 32 జీపీలలో గ్రామ స్థాయి సామాజిక తనిఖీలను నిర్వహించారు. తదుపరి మండల స్థాయి ప్రజావేదికలను శుక్రవారం నిర్వహించగా కొన్ని జీపీలలో ఫీల్డ్‌ అసిస్టెంట్ల అక్రమాలు బయటపడ్డాయి. పూర్తి వివరాలను శనివారం వెల్లడిస్తామని డీఆర్‌డీవో తెలిపారు. ఎంపీపీ సంగెం శ్రీనివాస్‌, అంబుడ్స్‌మెన్‌ శ్రీనివాస్‌రావ్‌, ఎంపీడీవో సయ్యద్‌ సాజిద్‌అలీ, సామాజిక తనిఖీ ఎస్‌ఆర్‌పీ తిరుపతి, ఏపీవో రాజేశ్వర్‌ పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలవాలి


స్వెటర్లను పంపిణీ చేస్తున్న వైద్యుడు రాజు

ఆర్మూర్‌: దివ్యాంగ విద్యార్థులు తమలోని వైకల్యాన్ని జయించేందుకు వారిని ప్రోత్సహిస్తూ అండగా నిలవాలని ఆర్మూర్‌ పట్టణానికి చెందిన ఫిజియోథెరపీ వైద్యుడు రాజు సూచించారు. పట్టణంలోని సీఎస్‌ఐ చెవిటి, మూగ ఆశ్రమ పాఠశాలలో వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు సొంత ఖర్చులతో ఆయన శుక్రవారం స్వెటర్లు పంపిణీ చేశారు.

చారిటబుల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో...

హైదరాబాద్‌లోని రెకల పరివార్‌ చారిటబుల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థులకు ఉచితంగా దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయుడు శాంతమూర్తి, మేనేజర్‌ సువర్ణ కిరీటి, ప్రత్యేక ఉపాధ్యాయులు నిర్మల, శ్రీజ, సుధ, మాధవి, రజిత, రేఖ, లక్ష్మి, రాజేష్‌, దిలీప్‌, వార్డెన్లు మణిదర్‌, ఎస్తేర్‌ పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు


రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాసచారి


ఉపాధ్యాయులతో సమావేశమైన పరిశీలకులు

మాక్లూర్‌: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసచారి తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. బడిలో సౌకర్యాలు, భోజనంపై ఆరా తీశారు. ప్రధానంగా 6, 7 తరగతుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. తనిఖీ బృందం సభ్యులు అనిత, రామారావు, పాఠశాల ప్రత్యేకాధికారి ప్రగతి ఉన్నారు.

పెర్కిట్‌: ఆలూర్‌ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను రాష్ట్ర పరిశీలకులు సంజీవ్‌ కుమార్‌, పవన్‌ కుమార్‌, శ్రీనివాస్‌ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో ఉన్నతి కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న బోధన తరగతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం నరేందర్‌ పాల్గొన్నారు.

వర్సిటీలో హాస్టల్స్‌ నిర్మించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మెయిన్‌ క్యాంపస్‌లో బాలికలకు, పీహెచ్‌డీ స్కాలర్స్‌కు ఒక్కో హాస్టల్‌, సారంగపూర్‌ ఎడ్యుకేషన్‌ క్యాంపస్‌లో బీఈడీ విద్యార్థులకు ఒక హాస్టల్‌ను వెంటనే నిర్మించాలని వర్సిటీ పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి జయంతి డిమాండ్‌ చేశారు. శుక్రవారం తెయూ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెయూలో బాలికలకు ఒకే హాస్టల్‌ ఉండటంతో సుమారు 500 మంది విద్యార్థినులకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ఒక్కో రూంలో 8– 10 మంది విద్యార్థినులు ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీహెచ్‌డీ స్కాలర్స్‌కు కూడా హాస్టల్‌ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సారంగపూర్‌ బీఈడీ కాలేజీలో సీట్లు వచ్చిన కొందరు గ్రామీణ ప్రాంత విద్యార్థులు హాస్టల్‌ సౌకర్యం లేకపోవడంతో తమ అడ్మిషన్స్‌ రద్దు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి బాలికలు, స్కాలర్స్‌, బీఈడీ విద్యార్థుల కోసం కొత్త హాస్టల్స్‌ను వెంటనే నిర్మించాలని డిమాండ్‌ చేశారు. ప్రిన్స్‌, దేవిక, ఆకాష్‌, అక్షయ్‌, మోహిత్‌, హన్మాండ్లు, లహరి పాల్గొన్నారు.

‘డబుల్‌’ ఇళ్ల పరిశీలన



ఎడపల్లి: మండలంలోని ధర్మారం గ్రామ శివారులో డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లను కాంగ్రెస్‌ నాయకులు శుక్రవారం పరిశీలించారు. కాంగ్రెస్‌ గ్రామ అధ్యక్షుడు సుండు నర్సయ్య మాట్లాడుతూ నాయకులే కాంట్రాక్టర్లుగా మారి నాసిరకంగా పనులు చేపట్టారని ఆరోపించారు. అర్హులకు ఇళ్లు కేటాయించకుండా సామగ్రిని దొంగిలించిన బీఆర్‌ఎస్‌ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. మాజీ సర్పంచ్‌లు సుండు లక్ష్మి, మల్లెపూల సావిత్రి, నాయకులు గణేష్‌ గౌడ్‌, చందూర్‌ అశోక్‌, సుండు యాదగిరి, మల్లెపూల రాజేశ్వర్‌ గౌడ్‌ ఉన్నారు.

దుప్పట్ల పంపిణీ



బోధన్‌టౌన్‌: క్రిస్మస్‌ పండుగను పురస్కరించుకొని బోధన్‌లోని సీఎస్‌ఐ చర్చిలో హ్యూమన్‌ రైట్స్‌, సీఎస్‌ఐ చర్చి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ కిరణ్‌కుమార్‌ మాట్లాడుతూ.. 60 మందికి దుప్పట్ల పంపిణీతో పాటు భోజనం ఏర్పాటు చేయడానికి దాతగా వ్యవహరించిన హ్యూమన్‌ రైట్స్‌ జిల్లా చైర్మన్‌ జ్యోతిరాజ్‌ కుటుంబ సభ్యులను అభినందించారు. పాస్టర్‌ రెవరెండ్‌ ప్రభాకర్‌, సత్యనారాయణ స్వామి, ఎడ్వర్డ్‌ ముల్లర్‌, కిశోర్‌కుమార్‌, సందీప్‌, రవికుమార్‌, గిరి తదితరులు ఉన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్‌



పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌(ఆర్మూర్‌)

స్క్రీన్‌-1 – చే లాంగ్‌లీవ్‌(తెలుగు)-12.50
జోరుగా హుషారుగా (తెలుగు)- 3.40, 6.40
కలశ (తెలుగు)- 9.50
స్క్రీన్‌-2 – హాయ్‌ నాన్న (తెలుగు)- 12.00, 03.15, 6.30, 09.45
స్క్రీన్‌-3 – తికమక తండా (తెలుగు)- 12.15, హాయ్‌ నాన్న - 2.45
ఎక్స్‌ట్రా ఆర్డినరీ మెన్‌ -06.00
పిండం (తెలుగు) - 09.20
స్క్రీన్‌-4 – యానిమల్‌(తెలుగు)- 10.00, 2.00 6.00, 9.00